క్లుప్తంగా

మండల సమైక్య సమావేశం



మాట్లాడుతున్న ఏసీ వసుంధరాదేవి

తాళ్లూరు: స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరదేవి మాట్లాడుతూ స్త్రీ నిధి ఉన్నతి రుణాలను సంఘ సభ్యులు ఉపయోగించుకొని లబ్ధి పొందాలని సూచించారు. ఏపీఎం దేవరాజు టీఏఎఫ్ వసూల గురించి మాట్లాడారు. జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ ప్రశంసపత్రం అందుకున్న వసుంధర దేవిని ఘనంగా సన్మానించారు. సీసీలు మోహన్‌రావు, సుచేంద్ర, సుజాత, మండల సమాఖ్య అకౌంటెంట్ కుమారి, మండల సమాఖ్య ఈసీ మెంబర్స్, వీవోఏలు పాల్గొన్నారు.

లోక కళ్యాణం కోసం బీహార్ వాసుల పాదయాత్ర



పాదయాత్రగా రామేశ్వరం వెళ్తున్న బీహార్ వాసులు

పెద్దదోర్నాల: లోక కళ్యాణం కోసం, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ బీహార్‌కు చెందిన ఇద్దరు చేపట్టిన పాదయాత్ర మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర చేపట్టిన అక్షత్ సింగ్, మనీష్ ఆనంద్‌లు మాట్లాడుతూ దేశ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని కోరుతూ కేదార్‌నాథ్ నుంచి రామేశ్వరం వరకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. దేశంలో ఉండే ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో పర్యటిస్తూ పాదయాత్ర కొనసాగుతోందని చెప్పారు. పాదయాత్ర ఏడాది పాటు ఉంటుందని పేర్కొన్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రంలో పర్యటించి సోమవారం బయల్దేరిన తాము దారిలో ఉన్న పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ రామేశ్వరం వరకు వెళ్లనున్నట్లు వివరించారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ముండ్లమూరు (దర్శి): సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘ మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు కోరారు. మహాసభలకు సంబంధించిన వాలు పోస్టర్‌లను మంగళవారం శంకరాపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఫిబ్రవరి 3వ తేదీన నెల్లూరులో నిర్వహిస్తున్న మహాప్రదర్శన, భారీ బహిరంగ సభకు ప్రజలు తరలి రావాలని పిలుపు నిచ్చారు. నెల్లూరులో జరుగుతున్న రాష్ట్ర మహాసభలకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా హామీల అమలుకు చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. సమస్యలను పరిష్కరించకపోగా ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారం మోపుతోందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాపోరాటాలు నిర్మించేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బోడపాటి హనుమంతరావు, గంగినేని సత్యనారాయణ, జి.వెంకటేశ్వర్లు, బొమ్మతోటి రాజారమేష్, మధన్‌మోహన్ పాల్గొన్నారు.

పశువైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



గోవును పరీక్షిస్తున్న పశువైద్యాధికారి

కొనకనమిట్ల: గ్రామాల్లో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని గొట్లగట్టు పశు వైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి సూచించారు. మంగళవారం చినమనగుండం గ్రామంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేశారు. పశువుల పెంపకం, వ్యాధుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, సహాయకులు బరిగె శ్రీనివాసులు, మేఘవత్ శివాజీ నాయక్, కాసు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక అవస్థలు

- ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
- ఆర్టీసీ అధికారులు స్పందించాలంటూ విజ్ఞప్తి



ఆర్టీసీ బస్సు

దొనకొండ: పొదిలి నుంచి వయా దొనకొండ, చందవరం, త్రిపురాంతకం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల్లోని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో పొదిలి నుంచి త్రిపురాంతకం బస్సు సౌకర్యం ఉండేది. నేడు బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. మండల ప్రజలు దొనకొండ రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోల్లో ప్రయాణంతో ప్రజలు ప్రమాదాలకు గురవతున్నారు. అంతేకాకుండా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేంద్రం పొదిలి నుంచి త్రిపురాంతకానికి మార్చారు. దొనకొండ, ఇతర గ్రామాల ప్రజలు ఆయన వద్దకు పని మీద వెళ్లాలంటే బస్సు లేక ఇబ్బంది పడుతున్నారు. ఆటో ప్రయాణాలు ఎన్నో సార్లు ప్రమాదాలకు గురయ్యాయి. అంతేకాకుండా విద్యార్థులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావాలంటే ఆటోలు ఆశ్రయించక తప్పడం లేదు. బస్సు పాస్‌లు ఉన్నా నిరుపయోగంగా ఉంది. ఎన్నిసార్లు పొదిలి డిపో అధికారులకు వినతి పత్రం అందజేసినా ప్రయోజనం లేకుండా పోయింది. 3 నెలలకు ఒకసారి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశంలో ఆర్టీసీ అధికారులకు పలువురు ప్రజాప్రతినిధులు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. సరే అంటున్నారు తప్ప ఉపయోగం ఉండటం లేదు. ఇప్పటికైనా ప్రజలు, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు నిత్యం త్రిపురాంతకం వెళ్తుంటారు:



మా గ్రామం నుంచి ప్రతి నిత్యం రైతులు త్రిపురాంతకం వెళ్లి వస్తుంటారు. వ్యవసాయ పనులకు సంబంధించి ఎరువులు కొనుగోలుకు ప్రజలు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రయాణం నరక యాతనగా ఉంది. పొదిలి డిపో అధికారులు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఎగ్గోని కృష్ణారెడ్డి, చందవరం

దొనకొండ ప్రజలకూ ఇబ్బందే:



చందవరం గ్రామం నుంచి దొనకొండ మండల కేంద్రానికి రోజూ పనులపై సామాన్య ప్రజలంతా వెళ్లాల్సి ఉంది. గతంలో దొనకొండ నుంచి త్రిపురాంతకానికి బస్సు సౌకర్యం ఉండేది. నేడు బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రజలు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు.

– బందారు రాజు, చందవరం

వేసవిలో కూరగాయల సాగు లాభదాయకం



దొనకొండ: మిర్చి పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి



మిర్చి పంటను పరిశీలిస్తున్న ఏఓ మధుబాబు

దొనకొండ: గ్రామాల్లోని రైతులు నీరు అందుబాటులో పుష్కలంగా ఉంటే కూరగాయలు సాగు చేసుకుంటే లాభాలు పొందవచ్చని మార్కాపురం ఉద్యానవన శాఖాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మల్లంపేట, రుద్రసముద్రం రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమై మాట్లాడారు. టమోటా, పచ్చి మిరప, వంగ, గోరు చిక్కుడు, ఆకు కూరలు తోటకూర, మెంతికూర, చుక్క కూర, తీగ జాతి దోస, కాకర, సొర, బీర, దొండ కూరగాయలు పండిస్తే వేసవిలో మార్కెట్‌లో అధిక ధరలు ఉంటాయన్నారు. వాణిజ్య పంటలైన మిర్చి, పొగాకు, పత్తి పంటలను తగ్గించి కూరగాయలు, ఆకు కూరలు పెంచుకుంటే తక్కువ సమయంలో మంచి లాభాలు పొందొచ్చన్నారు. కూరగాయల సాగు మెళకువల గురించి రైతులకు రమేష్ వివరించారు. వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం కంది కోతలు మొదలయ్యాయని, మండలంలో 5,600 ఎకరాల్లో సాగు చేశారని, రైతులు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. రైతులు సమస్యలు ఏవైనా ఉంటే తమ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఏఓ తెలిపారు. రైతులు, సిబ్బంది, మురళి, యోగేశ్వరరావు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి

కురిచేడు: మండలంలో కంది పంట సాగు చేసి ఈ–పంట నమోదు చేసుకున్న రైతులు తమ కందులు విక్రయించుకునేందుకు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ఇప్పటికే నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కంది పంట సాగు చేసిన ప్రతి రైతు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుంటేనే కందుల కొనుగోలు సాధ్యమవుతుందన్నారు. మండలంలో సాగులో ఉన్న పంటలు పంటలను ఆయన పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ఖరీఫ్ సీజన్‌లో వేసుకున్న కంది పంటను రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని వాదంపల్లి, అమానిగుడిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో భాగంగా గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ కంది పంటను ఆన్‌లైన్ చేసుకోవడంతో పాటు రబీలో వేసుకున్న పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో వేసుకున్న మినుము, కంది పంటలను ఆయన పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రిరెడ్డి, సిబ్బంది వివేక్, రంగ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరు: రైతులకు వ్యవసాయ సేవలు సులభతరం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. తాళ్లూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధార్ నెంబర్ లింకైన ఫోన్ నంబర్, పట్టాదారు పాసుబుక్ తీసుకొని రైతు సేవా కేంద్రంలో వీఏఏ ను సంప్రదిస్తే వివరాలు నమోదు చేస్తారని, ఫోన్లో ఓటీపీ చెప్తే నమోదు పూర్తవుతుందని తెలిపారు. రైతు గుర్తింపు సంఖ్య ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ పంటల బీమా, పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు తీసుకోవచ్చని చెప్పారు. ఏపీఎం దేవరాజ్, వీఏఏ లు నాయక్, వెంకట్రావు, వీఎఫ్ఏ ఎలీషా పాల్గొన్నారు.

పుల్లలచెరువు: రబీలో సాగు చేసిన ప్రతి పంటను రైతులు ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని చాపలమడుగు, పిడికిటివానిపల్లి గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, పొగాకు, మిరప పంటలను ఆమె మంగళవారం పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించామని, దాని నివారణకు ఎకరానికి లింగాకర్షక బుట్టలను 10 అమర్చితే పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. పొగాకులో మెళకువలు పాటించాలన్నారు. రైతులు సాగు చేసిన పంటకు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. అలా లేని పక్షంలో ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు అందే అవకాశం తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీఈవో గోపీకృష్ణ, ఏఈవోలు లక్ష్మీబాయ్, మస్తాన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండలంలోని పెద్దారవీడు, పుచ్చకాయలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మిరప, పొగాకు పంటలను మంగళవారం పరిశీలించారు. వ్యవసాయాధికారి బుజ్జిబాయి మాట్లాడుతూ మిరప పంటలో వచ్చే కాయ తొలుచు పురుగు నివారణకు పొలంలో బంతి పూలు, ఆముదం మొక్కలను నాటాలని, లద్దె పురుగులు ఆశిస్తే నివారణకు ఐదు కిలోల తవుడు, అర కేజీ కర్బరిల్, అర కేజీ బెల్లంతో తగినంత నీటిని కలిపి చిన్న చిన్న ఉండలు చేసి పొలంలో సమానంగా చల్లాలని, నేలలో దాగి ఉన్న పురుగులు రాత్రి పూట బయటకు వచ్చి తింటే అవి చనిపోతాయని చెప్పారు. ఈ–పంట నమోదు చేసుకునేందుకు పట్టాదారుని పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పుస్తకం, కౌలు రైతు అయితే కౌలు కార్డు తీసుకొని రైతులు రైతు సేవా కేంద్రానికి వస్తే వీఏఏలు నమోదు చేస్తారని తెలిపారు. వీఏఏలు ఆదిలక్ష్మి, లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

దర్శి: బిందు సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేలా రైతులు కృషి చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో నియోజకవర్గంలోని దర్శి, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలకు చెందిన దళిత రైతులకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ మల్చింగ్‌తో డ్రిప్ ద్వారా వ్యవసాయం చేస్తే మరింత తక్కువ నీటితో ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. కలుపు తీసే సమస్య, కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై జొన్న, మొక్కజొన్న, మినుము, అపరాల సాగు చేపడితే మంచి లాభాలు పొందవచ్చని చెప్పారు. సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నువ్వుల పంట సాగు విధానం, వర్మి కంపోస్ట్ సాగు విధానం గురించి వివరించారు. హోమ్ సైన్స్ శాస్త్రవేత్త మాట్లాడుతూ వివిధ రకాల కూరగాయలకు సంబంధించిన కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకునే అవకాశాల గురించి వివరించారు. డీబీఆర్‌సీ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కో ఆర్డినేటర్ గుంటూరు నాగమణి, డేవిడ్, గుత్తి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చోరీ ఇంటిని పరిశీలించిన క్లూస్ టీం



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

కురిచేడు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెనుక వైపు సోమవారం జరిగిన చోరీ ఇంటిని క్లూస్ టీం పరిశీలించింది. వేలిముద్రలు క్షుణ్ణంగా సేకరించింది. సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు ఉపాధ్యాయుడు బాదినేని హనుమంతరావు ఫిర్యాదు చేశాడు. చోరీ జరిగిన తీరును, వేలిముద్రల వివరాలను సేకరించిన క్లూస్ టీం.. వాటిని అనుమానితుల వేలిముద్రలతో సరిచూస్తూ దొంగలను గుర్తించే ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్సై శివ తెలిపారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



నాగరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దారవీడు: మండలంలో మద్దలకట్ట పంచాయతీ మాచరాజుకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కోనంగి నాగరాజుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఇటీవల దాడి చేసిన విషయం తెల్సిందే. మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నాగరాజు చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతున్న నాగరాజును సోమవారం రాత్రి పరామర్శించారు. కొట్లాట జరిగేందుకు కారణాలను నాగరాజు, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వివరంగా అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. మద్దలకట్ట పంచాయతీ చాట్లమడ అగ్రహారం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గాదెం మల్లికార్జున తల్లి రంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామాల్లో జరుగుతున్న పరిణామాల గురించి కార్యకర్తలను అడిగారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ, నాయకులు తోకల ఆవులయ్య, మూల సత్యంరెడ్డి, జడ్డా చిన్నరామయ్య, పార్టీ సోషల్ మీడియా కో కన్వీనర్ ఏర్వ మల్లికార్జునరెడ్డి, స్కూల్ చైర్మన్ బూసా వెంకటేశ్వర్లు, దుద్దెల కోటిరెడ్డి, గాదం శ్రీనివాసులు, తాతిరెడ్డి వెంకట నారాయణ, బూసా పేరయ్య, కార్యకర్తలు ఉన్నారు.

అధికారులే సమావేశాలకు రాకుంటే ఎలా?



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ రాములు

పుల్లలచెరువు: మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు రాకుంటే సమావేశాలు నిర్వహించడం ఎందుకని వైఎస్సార్ సీపీ నాయకుడు, మల్లాపాలెం ఎంపీటీసీ రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెంకటయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి తహసీల్దార్, ఎంఈవోలు, ఏఈలు తప్పని సరిగా హాజరు కావాల్సి ఉన్నా ఎవరూ రాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమని అడిగితే పని ఉందని చెబుతారని, అడిగే వారు లేకపోవడంతో మండల స్థాయి అధికారులు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోందని సభ్యులు మండిపడ్డారు. ఎంపీటీసీ సభ్యుడు రాములు మాట్లాడుతూ రెండు సార్లు గ్రామసభలు నిర్వహిస్తే ప్రజల సమస్యలు ఇంత వరకు పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు చెప్పుకోవాలన్నా ఇన్‌చార్జి తహసీల్దార్ యర్రగొండపాలేనికి పరిమితం కావడంతో కార్యాలయంలో సమాధానం చెప్పే వారు లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ముటుకుల స్టోరేజీ ట్యాంకు నుంచి చుక్క నీరు గ్రామాల్లోకి రావడం లేదని, అది కేవలం అధికారులకు, నాయకులకు బ్యాంకు మాదిరిగా ఉందని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకుంటే ప్రజలకు నీటి సమస్యలు తప్పవన్నారు. ఎంపీడీవో వసంతరావునాయక్ మాట్లాడుతూ మండలస్థాయి అధికారులంతా సమావేశాలకు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, ఏఈ కిశోర్, ఏపీవో శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ అధికారి శివలక్ష్మి, ఏపీఎం వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు గోల్ ఎంచుకుని ముందుకు సాగాలి



అడిషనల్ ఎస్పీని సత్కరిస్తున్న గుండారెడ్డి

దర్శి: పట్టణంలోని గౌతమి విద్యాసంస్థలు ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా ముగిశాయి. మూడు రోజులుగా జరుగుతున్న వేడుకలకు గుంటూరు అడిషనల్ ఎస్పీ హనుమంతు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రాసమణి తన ప్రాసతో సభలో నవ్వులు పూయించారు. ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. కళాశాల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హనుమంతు మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన గుండారెడ్డి అభినందనీయుడన్నారు. విద్యార్థులు గోల్ ఎంచుకుని అది సాధించే వరకు శ్రమించాలని సూచించారు. చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి మాట్లాడుతూ తమ విద్యా సంస్థల ద్వారా చదువు నేర్చుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు. హాజరైన పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు తమ అనుభవాలు నెమరు వేసుకున్నారు. హాజరైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కూలీలందరికీ పని కల్పించాలి



మూగచింతలలో పనులు పరిశీలిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

పొదిలి రూరల్: జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ ఉపాధి హామీ పని కల్పించాలని డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. పొదిలి మండలంలోని మూగచింతల పంచాయతీలో ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. కూలీలు ఉదయం 6 గంటలకు నిర్దేశిత ప్రదేశానికి హాజరై ఎక్కువ సేపు పని చేయడం వల్ల కూలీ అధికంగా పొందవచ్చని చెప్పారు. 100 రోజులు పూర్తి కావచ్చిన కుటుంబాలకు త్వరితగతిన డిమాండ్ ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు రోజుకు రూ.300 వచ్చేలా మార్కింగ్ ఇవ్వాలని ఫీల్డ్ సిస్టెంట్‌కు సూచించారు. రానున్న ఆరు నెలల్లో చేపట్టవలసిన పనుల జాబితాను ఫీల్డ్ అసిస్టెంట్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో గుర్తించిన అమృత సరోవర్ ట్యాంక్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఆయన వెంట ఏపీడీ ఆర్.లలిత, ఏపీఓ వెంకట్రావు, ఈసీ శివకుమార్ ఉన్నారు.

పంచాయతీ నిధుల స్వాహాపై విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

కురిచేడు: స్థానిక గ్రామ పంచాయతీలో నిధుల స్వాహాపై డీఎస్పీ లక్ష్మీనారాయణ మంగళవారం రాత్రి విచారణ చేపట్టారు. రెండు సంవత్సరాల క్రితం పంచాయతీ కార్యాలయంలో సుమారు రూ.30 లక్షలు మాయం కావడంపై అప్పటి కంప్యూటర్ ఆపరేటర్‌పై కేసు నమోదైంది. ఆ కేసుకు సంబంధించి విచారణ చేపట్టినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. పంచాయతీ సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీలను విచారించారు. ఆ కేసుకు సంబంధించిన దస్త్రాలను తెప్పించి పరిశీలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. విచారణలో ఎస్సై శివ పాల్గొన్నారు.